మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల ప్రతినిధి జులై 8 ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం విచ్చేసిన ప్రజల నుండి 45 ఫిర్యాదులను అదనపు కలెక్టర్లు ముసిని వెంకటేశ్వర్లు, నర్సింగరావులతో కలిసి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి...

జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 08 ప్రభాతవార్త: ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ ప్రజావాణి సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి స్వయంగా కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు వివిధ శాఖల్లో సమస్యల పరిష్కారానికి మొత్తం 68 ఫిర్యాదులు అందాయని, వాటిని పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ కె.సీతారామారావు, సీపీఓ భూపాల్‌రెడ్డి, ఏఓ చంద్రశేఖర్‌లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

విజయోత్సవ ర్యాలీలో ఎంపి డికె అరుణ

మక్తల్,జులై 08 ప్రభాతవార్త : పాలమూరు అభ్యర్థిగా గెలిచిన తర్వాత పార్లమెంట్ అభ్యర్థి డికె అరుణమ్మ మక్తల్‌కు పార్లమెంట్ అభ్యర్థిగా మొదటిసారి ఘన స్వాగతం లభించింది. నల్లజానమ్మ గుడి దగ్గర నుండి పురవీధుల గుండా ర్యాలీగా తరలి ద్వారకా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ ఎంపి డికె అరుణ మాట్లాడుతూ పాలమూరులో బిజెపిని ఓడించడానికి ముఖ్యమంత్రి ఎన్నో రకాలుగా కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేసిన కాని ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ఏడు మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా, 7నియోజకవర్గాలలో పట్టుదలతో నరేంద్రమోడీ నాయకత్వంలో మోడీ ప్రధాని కావాలని పాలమూరులో నన్ను గెలిపించడానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో 9 వేల మెజార్టీ తెప్పించి గెలిపించిన ప్రతి కార్యకర్తకు – మిగతా3లో..

ఎంపి డికె అరుణను సన్మానిస్తున్న దృశ్యం

గ్రామపంచాయతీ సిబ్బంది భిక్షాటన

శ్రీరంగపురం జులై 08 ప్రభాతవార్త : గ్రామ పంచాయతీ సిబ్బందిపై ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ, మండల కేంద్రములో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం గ్రామపంచాయతీ సిబ్బంది భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల మండల అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ..ఆరు నెలల నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది కి వేతనాలు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అందులో భాగంగానే మండల కేంద్రంలోని ప్రతి షాపు యజమానీ దగ్గరకు వెళ్లి మా పరిస్థితిని వాళ్లకు వివరిస్తూ భిక్షాటన చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం త్వరితగతిన చొరవ తీసుకొని పంచాయతీ కార్మికుల పెండింగ్ నిధుల విడుదల, మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు, గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాన్ని – మిగతా3లో..

ఆధార్ సేవ కేంద్రం దగ్గర బిక్షాటన చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

పాలమూరు అభివృద్ధికై..

- నేడు మహబూబ్‌నగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రాజెక్టులు, విద్యా,వైద్యం రంగాలపై సమీక్ష
- పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతలపై ఫోకస్
- త్వరగా పూర్తి నీళ్లు అందించేందుకు కార్యాచరణ
- ఇప్పటికే పలు అంశాలపై సమీక్ష నిర్వహించిన మంత్రులు,ఎమ్మెల్యేలు
- సీఎం వరాలపై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు

మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై 8, ప్రభాతవార్త : ఉమ్మడి పాలమూరు సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. సీఎం సొంత జిల్లా కావడంతో మొదటి నుంచి పాలమూరు అభివృద్ధికి కంకణబద్ధులై ఉన్నానని పలు సమావేశాల్లో ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఉమ్మడి పాలమూరు జిల్లాలో జరుగుతున్న మొదటి సమీక్ష సమావేశం కావడంతో ప్రజాప్రతినిధులే కాదు నాయకులు, ప్రజల్లోనూ ఉత్సాహం నెలకొన్నది. సీఎం ఏఏ అంశాలపై మాట్లాడుతారు..ఏఏ వరాలు కురిపిస్తారు..కొత్తగా ఏ విషయాలు చెబుతారు అని అంతా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటి ఉమ్మడి జిల్లాలోని 14నియోజకవర్గాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి తయారు చేశారు. ప్రధానంగా ప్రాజెక్టులు, విద్యా, వైద్యం అనే అంశాలపై సమీక్షించనున్నట్లు తెలుస్తున్నది.

పాలమూరు ప్రాజెక్టుపై..

ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాకు సాగునీటి, తాగునీటి కోసం ఉద్దేశించి రూ.35200కోట్ల భారీ అంచనా వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు వద్ద శ్రీశైలం జలాశయం నుంచి నీటి తోడి ఆరు ఎత్తిపోతల పథకాలకు అంజనగిరి,వీరాంజనేయ, వెంకటాద్రి,కురుమూర్తి రాయ,ఉదండాపూర్, లక్ష్మీదేవిపల్లి జలాశయాలతకు నీటి ఎత్తిపోయడం ఉద్దేశం. రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 90 టీఎంసీలు ఎత్తిపోలన్నదే ప్రాజెక్టు లక్ష్యం. 2023 సెప్టెంబర్ 3న నార్లాపూర్ పంప్‌హౌజ్ వద్ద చేపట్టిన మొదటి పంప్ డ్రైరన్ విజయవంతమైంది. తొమ్మిది మోటార్లకు గానూ మొదటి మోటారు డ్రైరన్ ఇంజినీర్లు విజయవంతంగా పూర్తి చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కొంద ఉమ్మడి మహబూబ్‌నగర్,రంగారెడ్డి, వికారాబాద్,నల్గొండ జిల్లాలోని 71మండలాలకు 1226 గ్రామాలకు తాగునీరు, 12.30లక్షల ఎకరాలకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందిచేందకు డిజైన్ చేయబడ్డాయి. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి సాగునీరు. తాగు నీరు అందించేందుకు చర్యలు వేగవంతం చేసే దిశగా సర్కారు అడుగులు వేయనున్నట్లు తెలుస్తున్నది. ఈమేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు విషయంపై ప్రధానంగా సమీక్షించనున్నట్లు తెలిసింది. దీంతోపాటు మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్, భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, తుమ్మిళ్ల ప్రాజెక్టులను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని వాటిని పూర్తి స్తాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తున్నది.

సీఎం షెడ్యుల్ :

- మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి మహబూబ్‌నగర్‌కు హెలీక్యాప్టర్‌లో బయలుదేరారు.
- 12.30గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటారు.
- 12.45గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నూతన కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- 1.45గంటల నుంచి 4.45గంటల వరకు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలతో సమీక్ష
- 4.45గంటలకు కలక్టరేట్ నుంచి ఏఎస్ఎన్ గార్డెన్‌కు బయలుదేరుతారు.
- 5గంటల నుంచి 5.45గంటల వరకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమీక్ష
- సాయంత్రం 6గంటలకు హెలీక్యాప్టర్ ద్వారా తిరిగి బేగంపేటకు బయలుదేరి 6.30గంటల వరకు చేరుకుంటారు.

ప్రాజెక్టుకు జాతీయ హోదాపై..

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ హోదా అంశం నానుతూ వస్తున్నది. గత ప్రభుత్వంలో జాతీయ హోదాపై పలుమార్లు కేంద్రానికి విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈక్రమంలో కేంద్రంలో మళ్లీ మోడీ ప్రభుత్వం రావడం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో అందరి దృష్టి అభివృద్ధి పైనే ఉన్నది. పాలమూరు రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపేందుకు సీఎం కృషి చేస్తున్నారు. ఇప్పటికే కొడంగల్–మక్తల్,నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులను రూ.5వేల కోట్లతో –మిగతా3లో..

99 ఏండ్లు లీజుకి ఇచ్చినట్లు నిరూపించాలి..

- పదేళ్లు మహబూబ్‌నగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశా
- నా ఫ్లెక్సీలు చింపేసిన ప్రజల గుండెల్లో ఉన్నా
- వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ దవాఖానను త్వరగా పూర్తి చేయాలి
- మాజీ మంత్రి బి.శ్రీనివాస్‌గౌడ్ సవాల్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ బ్యూరో,జులై08 ప్రభాతవార్త: బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న టూరిజం హోటల్‌ను 99 ఏండ్లు తాను లీజుకు తీసుకున్నారని మంత్రి చెప్పిన మాటల్లో వాస్తవం లేదని, ఉంటే నిరూపించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ సవాల్ విసిరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మీదే ఉంది కదా నిరూపించండి నేను ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని తేల్చి చెప్పారు. ఆసుపత్రి ముందు షాపింగ్ కాంప్లెక్స్ హోటల్ ఉంటే రోగులకు వారి కోసం వచ్చిన బంధువులకు ఉపయోగపడుతుందని, ఐటీ కంపెనీలు, ప్రజలు ఉద్యోగులు వేడుకలు ఇతర సమావేశాలు పెట్టుకునేందుకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోకుండా కేవలం తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తన ఫొటోలతో ఉన్న బ్యానర్‌లు ఉంటే చించి వేస్తున్నారని ఆరోపించారు. బ్యానర్ చించవచ్చు. కానీ ప్రజల గుండెల నుంచి చెరపలేరని స్పష్టం చేశారు.

మహబూబ్‌నగర్‌లో ఐటీకారిడార్,జంక్షన్స్, ట్యాంక్ బండ్ కెసిఆర్ ఎకోపార్కు మెడికల్ కాలేజీ పెద్ద ఎత్తున గురుకులాలు తీసుకువచ్చినా మహబూబ్‌నగర్‌లో జరిగిన అభివృద్ధిచూస్తే ప్రజలకి శ్రీనివాస్‌గౌడ్ గుర్తుకు వస్తారని, స్థానిక ఎమ్మెల్యే దృష్టి పెట్టాల్సింది మహబూబ్‌నగర్ అభివృద్ధిపైన మిమ్మల్ని గెలిపించిన ప్రజల సంక్షేమము కోసం దృష్టి పెట్టండి, తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ స్పోర్ట్స్ హాస్టల్ ఇండోర్ స్టేడియంలో ఏసీ పనులు, ట్యాంక్‌బండ్ వద్ద ఐల్యాండ్, చిన్నపిల్లల పార్కు, కెసిఆర్ ఎకో పార్కులో బర్డ్ ఎన్‌క్లోజర్ ఫ్రూట్ మార్కెట్, హజ్ హౌస్ మైనార్టీ పాఠశాలలు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జెఎన్‌టియు క్యాంపస్ మంజూరు చేసి జిఓ జారీ చేసినా ఇప్పటివరకు దాని ఊసెత్తడం లేదని, మన్యంకొండ రోప్‌వే పనులు ప్రారంభం కాలేదని, దేవాలయ ఆవరణలో పనులు నిలిచిపోయాయని చెప్పారు. హన్వాడ మండలంలో చెక్‌డ్యాముల పనులకు టెండర్లు పూర్తయ్యాయని మహబూబ్‌నగర్ –మిగతా3లో..

వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

గద్వాలప్రతినిధి జులై8 ప్రభాతవార్త: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశించారు. సోమవారం ధరూర్‌మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆరోగ్య సిబ్బంది హాజరు పట్టికను, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్సకై వచ్చిన రోగులను పలకరించి ఆసుపత్రి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి ప్రతిరోజు రోగులు ఎంతమంది వస్తున్నారు. ఇన్ పేషెంట్స్ వారి గురించి వాకబు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేయు సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని, వందశాతం నార్మల్ డెలివరీలు చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి డెంగీ, మలేరియా లాంటి వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్ పరిశీలించడం జరిగింది. ల్యాబ్ టెస్టు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టాక్ రిజిస్టర్ సిజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల స్టాక్లను పరిశీలించారు. గ్రామాలలో ఎన్సీడీ కార్యక్రమం క్రింద 30 సంవత్సరాలకు పై బడిన వారిని గుర్తించి వారిలో బిపి, షుగర్ లాంటి వ్యాధులను గుర్తించి అవసరమైన మందులు అందజేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్‌లకు స్వచ్ఛమైన త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డా.గ్యాని వెంకట్ రాజు,కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ ఆనందయ్య,ఫార్మసిస్టు శ్రీహరి, ల్యాబ్ టెక్నీషియన్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

ఉమ్మడి పాలమూరు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం..

ప్రజాపాలనతో కొత్త ఒరవడి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ప్రాజెక్టులు, విద్య, వైద్యంపై దృష్టి

గత తప్పిదాలను సరి చేసేందుకు సీఎం సమీక్ష

విలేఖరుల సమావేశంలో డిసిసి అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జిఎంఆర్

మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 08 ప్రభాతవార్త : పాలమూరు మొత్తం అభివృద్ధి చెందాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన ఏర్పడిన తర్వాత జనరంజకంగా పరిపాలన కొనసాగిస్తూ, ముఖ్యమంత్రి పాలనలో ఒక నూతన ఒరవడి కొనసాగిస్తూ, ప్రతివారం పదిరోజులకు రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా నిర్వహించే సమీక్షల్లో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న అన్ని సమస్యలపైన సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. పాలమూరు జిల్లా ప్రధాన సమస్యగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు గురించి ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు పలు సమస్యలపై మంత్రులతోటి, అధికారులతోటి ఇప్పటికే సమీక్ష చేయడం జరిగిందని, మంత్రులు సీఎంకు ప్రజంటేషన్ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. నిర్మాణంలో ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని ఉమ్మడి జిల్లా మొత్తానికి ఉపయోగపడే విధంగా అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు వీలైనన్ని నిధులు కూడా ప్రభుత్వం నుంచి తెచ్చేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. మెడికల్ కాలేజీలో అవసరమైన మేరకు అధ్యాపకులు, ఇతర సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. గత బిఆర్ఎస్ పాలనలో విద్య, వైద్యం రెండు కూడా వివక్షకు, విధ్వంసానికి గురైనట్లు ఆయన ఆరోపించారు. పశ్చిమ పాలమూరు జిల్లా వలసతోటి ఆగమైందని అందుకే రూ.5వేల కోట్ల తోటి ఏర్పాటు చేసే కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంతో పాటుగా పలు అభివృద్ధి పనులను చేపట్టాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా పట్టుబట్టి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. మాకు తోటి ప్రాంతం, తోటి పార్టీలతో పని లేదని పాలమూరు అభివృద్ధియే ప్రధానం అని ఆయన స్పష్టం చేశారు. పాలమూరు యూనివర్సిటీ ఉమ్మడి జిల్లాకు సంబంధించినదని, ఉమ్మడి జిల్లాలో ఉన్న వివిధ సంస్థలు ఈ సంస్థ పరిధిలోనే కొనసాగుతాయని, పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి కోసం 100 కోట్ల రూపాయల నిధులు రావడంతో ఉమ్మడి జిల్లా విద్యా వ్యవస్థకు మంచి రోజులు వచ్చినట్లు తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో లా కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నట్లు తెలిపారు. భూత్పూర్ జడ్చర్ల మహబూబ్‌నగర్ ట్రై జంక్షన్ వద్ద ప్రభుత్వ భూములు ఉన్నాయని, దానిని నేషనల్ ఇన్స్టిటిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏర్పాటు చేస్తే మూడు రాష్ట్రాలకు లబ్ది చేకూరుతుందని ఆయన గుర్తు చేశారు. విద్య, వైద్యం, స్కిల్ డెవలప్‌మెంట్ పరంగా అభివృద్ధియే –మిగతా3లో..

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రిబోయి

మహబూబ్‌నగర్‌బ్యూరో,జులై08 ప్రభాతవార్త: రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లను జిల్లాకలెక్టర్, జిల్లా ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ నిలిపేప్రాంతాన్ని అనంతరం రాష్ట్ర మంత్రులతో పాటుగా, ప్రభుత్వ సలహాదారులు, ఎంపిలు,ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించే సమీకృత జిల్లా అధికారుల సముదాయం సమావేశ మందిరాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ఏర్పాట్లపై ఎమ్మెల్యే సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ జానకి, పిడి డిఆర్‌డిఎ నర్సింహులు, డిపిఆర్ఓ శ్రీనివాసులు, డిఎఫ్ఓ సత్యనారాయణ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో చెరగని ముద్ర వైఎస్ఆర్..

సంక్షేమ పథకాలకు ఆద్యుడు జలయజ్ఞం, 108,104లాంటి ఎన్నో పథకాల రూపకర్త వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ బ్యూరో,జులై08 ప్రభాతవార్త: వైఎస్ఆర్ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని వైఎస్ఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన మహానాయకుడు వైఎస్ఆర్ అని అన్నారు. నాడు ఆయన చేసిన పాదయాత్ర సందర్భంగా ప్రజలు పడుతున్న కష్టాలను గ్రహించి, వాటిని తప్పించడానికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని రాష్ట్రంలో నాటి కరువు కాటకాలు దూరం చేసేందుకు, జలయజ్ఞం ద్వారా పేద రైతుల కన్నీళ్లు తూడ్చే ప్రయత్నం చేశారని ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు 108, 104 ఆరోగ్యశ్రీ సేవలకు శ్రీకారం చుట్టి ప్రపంచంలో ఎవరూ అందించలేని విధంగా ప్రతి పేదవాడికి కార్పోరేట్‌లో నాణ్యమైన వైద్యం అందించారని ఆయన పేద ప్రజల కోసం చేసిన సేవలు అమోఘం అన్నారు. ప్రధానంగా పాలమూరు జిల్లా కోసం అనేక ప్రాజెక్టులు తీసుకువచ్చారని అందులో భాగంగా గోదావరి నీటిని దక్షిణ తెలంగాణాకు తీసుకువచ్చేందుకు ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని దాని ద్వారా రంగారెడ్డి జిల్లాకు కూడా గోదవరి జలాలు అందించాలనే లక్ష్యంతో నాడు పని చేశారని, ఎంతోమంది సాధ్యం కాదని వ్యతిరేకించినా,నాడు ఆయన వెనుకడుగు వేయలేదని గుర్తు చేశారు. కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన పాలకులు కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరుమార్చి విధ్వంసం సృష్టించారని ఆయన ఆరోపించారు. పేదవాడికి ఎక్కడ కష్టం వచ్చినా అక్కడ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య, బెక్కరి అనిత, సిజె బెనహర్, ఐఎన్‌టియుసి రాములు యాదవ్, ఫయీమ్, పీర్ అహ్మద్ సాదిక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, అజ్మత్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీద్ స్థలాలు కబ్జాకు

గురికాకుండా చర్యలు తీసుకోవాలి

మైనార్టీలు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం..

అమరచింత జులై 08 ప్రభాతవార్త : అమరచింత మున్సిపల్ కేంద్రంలో అడ్డాకుల కాశీం పీర్ల మసీద్ స్థలం కబ్జా కాకుండా రక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు తౌఫిక్ మాట్లాడుతూ, అమరచింత మున్సిపల్ కేంద్రంలోని పదో వార్డులో అడ్డాకుల కాశీం పీర్ల మసీదు శిథిల వ్యవస్థకు చేరుకొని పడిపోయిందని కాశీం పీర్లకు చెందిన మసీద్ స్థలంలో హోటల్ రాములు డబ్బా వేసుకుని టీ కొట్టు నడిపే వారిని అట్టి స్థలంలో ఆయన వారసులు మసీదు స్థలం మా సొంత స్థలం అని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. పట్టణంలో మైనార్టీలకు సంబంధించిన భూములు మసీద్ స్థలాలు కబ్జాకు గురికాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిచో ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బడేసాబ్, షేక్ పాషా, అషు, జామియా మసీద్ కమిటీ, అడ్డాకుల కాశీం పీర్ల మసీదు కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బిసి గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో

స్పాట్ కౌన్సిలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కెటిదొడ్డి, జులై 08 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని జోగులాంబ గద్వాల జిల్లాలో గల ధరూర్ మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిరావుపూలే బిసి గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు గాను ఈనెల 10వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్ల కళాశాల ప్రిన్సిపాల్ దేవానందం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కోర్సు వారిగా వివరాలు : బిఎ (ఇపిహెచ్), బికాం (సిఏ), బిఎస్సీ నందు ఎంపిసి. ఎంపిసిఎస్, ఎంఎస్‌సిఎస్, ఎంఎస్‌డిఎస్, బిజడ్‌సి, ఎంజడ్‌సి కోర్సులన్నీ ఇంగ్లీష్ మీడియంలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి, అర్హత కలిగిన మహిళా విద్యార్థినిలు ఈనెల 10వ తేదీన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పరమాల స్టేజీ దగ్గర గల మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలో జరిగే స్పాట్ కౌన్సిలింగ్ కు హాజరు కాగలరని కోరారు. వివరాలకు 9154102764 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

-డిపో మేనేజర్ టి.దేవరాజు

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 08, ప్రభాతవార్త: అరుణాచల గిరిప్రదర్శనకు ఆర్టీసీ సూపర్ లగ్జరి బస్సును ఏర్పాటు చేసినట్లు నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.దేవరాజు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోనేజర్ టి.దేవరాజు మాట్లాడుతూ భక్తుల ప్రయాణ సౌకర్యార్థం నాగర్‌కర్నూల్ నుంచి సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని, ఇట్టి అవకాశాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ బస్టాండ్ నుంచి శుక్రవారం రాత్రి 9 గంటలకు బయలుదేరి 20వ తేదీ ఉదయం కాణిపాకంలోని వినాయకుడి దర్శనం చేసుకొని అదే రోజు సాయంత్రం గోల్డెన్ టెంపుల్‌ను సందర్శన ప్రయాణీకులకు ఉంటుందన్నారు.రాత్రి 8 గంటలకు అరుణాలచం చేరుకొని 21న గిరి ప్రదర్శన కార్యక్రమం అనంతరం సాయంత్రం బస్సు బయలుదేరి 22న ఉదయం 5 గంటలకు నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.3600లు, పిల్లలకు రూ.2400ల చొప్పు టికెట్ ధరలు నిర్ణయించామన్నారు. మరింత సమాచారం కోసం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను సంప్రదించాలన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

అమరచింత జులై 08 ప్రభాతవార్త : ఈనెల 10న కార్మికుల కోర్కెల డిమాండ్స్ డే సందర్భంగా అమరచింత మండల తహశీల్దార్ కార్యాల యం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని సిఐటియు జిల్లా సహాయ కా ర్యదర్శి, ఆర్ ఎన్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేం ద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారులకు వచ్చిన తక్షణమే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు రంగాలకు అప్పజెప్పడానికి పూనుకు న్నదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని సిఐటియు పిలుపుమేరకు ధర్నాలు నిర్వహిస్తు న్నామని తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు వివిధ రం గాలలో పనిచేస్తున్న కార్మికులు భారీగా తరలిరావాలని ఆయన కార్మికు లను కోరారు.

బడీడూ పిల్లలు పాఠశాలలో ఉండాలి...

ఆపరేషన్ ముస్కాన్ స్మైల్ బృందం ఎస్ఐ యాదయ్య

కల్వకుర్తిటౌన్, జూలై 08 ప్రభాతవార్త: కల్వకుర్తి పట్టణంలోని ఓ బైక్ మెకానిక్ షాపులో బడీడూ బాలుడు పనిచేస్తున్నాడని గుర్తించి నాగర్‌కర్నూల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హజరు పర్చామని ముస్కాన్ స్మైల్ బృందం ఎస్ఐ యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ యాదయ్య మాట్లాడుతూ 18 సం॥ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేస్‌తో పాటు జరిమానా విధించడం జరుగుతుందని, ఎక్కడ కూడా పిల్లలను పనిలో పెట్టకుండా పాఠశాలలో ఉండే విధంగా ప్రతి పౌరుడు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఎస్ఐ నరసింహ, హెడ్ కానిస్టేబుల్ పాండునాయక్, డీపీసీయూ యూనిట్ జే.మధుబాబు, ఎస్టేట్ లేబర్ అధికారి జూనియర్ అసిస్టెంట్ సప్తగిరి, కోనేరు సంస్థ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్‌యాదవ్, చైల్డ్ లైన్ ప్రతినిధి ప్రమీళ, మహిళ హోంగార్డు అరుణ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై ఆర్డీఓకు వినతి

కల్వకుర్తిటౌన్, జూలై 08 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదని, ఎన్నికల్లో ప్రకటించిన మెనిఫెస్టో ప్రకారం నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షులు దారమోని గణేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ఆర్డీఓ శ్రీనునాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతిని ప్రకటించి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఎస్సీ అన్ని పోస్టులకు మెగా డీఎస్సీని నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వెంటనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నాగరాజు, అల్లుడు కృష్ణ, నిరుద్యోగులు రాజునాయక్, పాండు, ప్రేమ్, శ్రీవాణి, మానస, మాధవి తదితరులు ఉన్నారు.

అధైర్యం వద్దు.. కార్యకర్తకు ఎమ్మెల్యే భరోసా...

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 08, ప్రభాతవార్త: అధైర్య పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, తనకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటిలోని 9వ వార్డుకు చెందిన మడిగల గోపాల్ కొద్ది రోజుల క్రితం గుండెకు సంబంధించిన చికిత్స తీసుకొని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సోమవారం మడిగల గోపాల్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల దృష్టి సారించి, మెరుగైన ఆరోగ్యానికి ఆహార నియామాలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు మిడిదొడ్డి సురేష్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్

తెలంగాణ ఆవిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల ప్రతినిధి జులై 8 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం యొక్క ఇంటింటా ఇన్నోవెటర్ 2024 కార్యక్రమం పోస్టర్ ను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం యొక్క ప్లాగ్షిప్ ప్రోగ్రామ్ అయిన ఇంటింటా ఇన్నోవెటర్ 2024 6వ ఎడిషన్ ను జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆవిష్కరించారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ఇంటింటా ఇన్నోవెటర్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు దరఖాస్తు చేసుకునే సమయం వచ్చేసిందని, ముఖ్యంగా గ్రామీణ ఆవిష్కర్తలు సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్న ఈ కార్యక్రమం తెలంగాణ అంతటా ఆవిష్కరణల కోసం పెంపొందించే వాతావరణాన్ని సృష్టించేందుకు అంకితభావంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ మేరకు ఇంటింటా ఇన్నోవేటర్ 2024 పోస్టర్ ను కలెక్టర్ లాంచ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ప్రస్తుతం 2024 ఎడిషన్ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. అన్ని వర్గాలలో ఉన్న ఆవిష్కర్తలు, ముఖ్యంగా గ్రామీణ తెలంగాణలో నివసిస్తున్న వారిని, వారి అద్భుతమైన ఆలోచనలు మరియు ప్రాజెక్టులను సమర్పించమని ప్రోత్సాహిస్తున్నాము. ఈ సంవత్సరం కార్యక్రమం ఇప్పటి వరకు అత్యంత విస్తృతమైనదిగా ఉండబోతుంది. విస్తృతమైన ప్రేక్షకులను చేరుకుంటుంది. మొగ్గతున్న నూతనోన్ముఖులకు బలమైన మద్దతు వ్యవస్థను అందిస్తుంది.ఈఏడాది వచ్చిన ఆవిష్కరణలు అన్నింటిలో గొప్ప ఆవిష్కరణలు అన్నింటికి ఆగస్టు 15న అవార్డు ప్రదానోత్సవం ఉంటుంది. ఇంటింటా ఇన్నోవేటర్ 2024 ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా విస్తృత ప్రేక్షకులకు చేరుకునే దిశగా మిగిలిపోతుందని , హామీ ఇస్తుంది. గ్రామీణ ఆవిష్కర్తలను సాధికార పరచడం పై దృష్టి సారించి, ఈ కార్యక్రమం 33 జిల్లాలన్నింటిని కవర్ చేయాలని, 3000లకు పైగా ఎక్కువ గ్రామ పంచాయితీలలో నిమగ్న మవ్వాలని 1 కోటికి పైగా గ్రామీణ ప్రజలతో అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది కార్యక్రమంలో సరికొత్తగా జిల్లాకు ఒకరి చొప్పున 33 మంది యువ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తోంది. ఇన్నోవేషన్ మిత్రాలుగా మూడు నెలలు కాలానికి జులై సెప్టెంబర్ 2024 ఆన్ గ్రౌండ్ సమన్వయకర్తగా పనిచేసే ఈమిత్రాలు జిల్లా అధికారులు, ఎన్జీఓలు, పౌర సమాజ సంస్థలు గ్రామీణ ప్రజలతో సహా విభిన్న వాటాదారులతో నిమగ్నమవడంలో కీలక పాత్ర పోషిస్తారు. తెలంగాణ మారుమూల గ్రామాల్లో కూడా ఆవిష్కరణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సరికొత్త ఆవిష్కరణలను తీసుకురావటమే వారి లక్ష్యం. ఇంటింటా ఎన్నోవెటర్ 2024 కార్యక్రమం దరఖాస్తు ప్రక్రియ సులువుగా, అనుకూలంగా ఉండేలా రూపొందించబడింది. ఆవిష్కర్తలు వారి దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 ఈ నెంబర్‌కు పంపించవచ్చు. దయచేసి దరఖాస్తులో ఈక్రింది సమాచారం ఉండేలా చూసుకోండి. పేరు, వయసు, ఫోటో,వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, 100 పదాలలో ఆవిష్కరణ వివరణ, ఆవిష్కరణ యొక్క నాలుగు చిత్రాలు హై రిజల్యూషన్ ఆవిష్కరణ యొక్క విధులను ప్రదర్శించే రెండు వీడియోలు, మీ వివరాలు పంపించేందుకు ఆఖరి తేది ఆగస్టు 3,2024 ఇతర వివరాలను తెలుసుకునేందుకు వాణి బుద్ధవారపు, మేనేజర్ తెలంగాణ రాష్ట్ర ఇన్నోవాషన్ సెల్‌కు కింద చూపిన 9441191829 సెల్ నెంబర్‌కు సంప్రదించాలి అన్నారు.

కౌలు రైతులకు రుణార్హత కార్డులు, రైతు భరోసా ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కొత్తకోట జులై 08 ప్రభాతవార్త : కౌలు రైతులకు రుణర్హత కార్డులు అందజేసి రైతు బరోసా కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామంలో కౌలు రైతుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ..కౌలు రైతులకు రుణార్హత కార్డులు, రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బ్యాంకుల సర్వే ప్రకారం 24 లక్షల మంది కౌలు రైతులు 35 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. అని గత ప్రభుత్వం వచ్చిన కొత్తలో మొదటి 2 సంవత్సరాలు కౌలు రైతులకు రుణ అర్హత కార్డు ఇచ్చారు. రుణాలు మాత్రం రూ.23 కోట్లకు మించలేదు. ఈ తరువాత జాయింట్ లయబిలిటీ సంఘాలు ఐదుగురు రైతులతో ఏర్పాటు చేశారని తెలిపారు. నేడు కౌలు రైతులు 4 అంశాలను కోరుతున్నారు.1. పంటరుణాలు 2.పంటల భీమా 3.ప్రభుత్వ పథకాలు(సబ్సిడీ) 4.ప్రకృతి వైపరిత్యాల పరిహారం ఈ కార్డు వల్ల భూ యజమానుల హక్కులకు ఎలాంటి ప్రమాదం లేదు. లోన్ ఎలిజబిలిటీ కార్డ్ పై ఈ కార్డు ద్వారా భూ యజమానికి వ్యతిరేకంగా కౌలు దారు ఎలాంటి సాక్షంగా వినియోగించరాదు. అనే నిబంధన వ్రాసి ఉందని అందువల్ల రుణ కార్డుల వల్ల రైతులకు ఎలాంటి నష్టం, ప్రమాదం లేదు. ఈ పథకాలను అమలు జరపాలని గత శతాబ్ద కాలంగా కోరుతున్నా టిఆర్ఎస్ (బిఆర్ఎస్) ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. పైగా కౌలుదార్లను, వాస్తవ సాగుదార్లను తొలగిస్తూ ధరణిలో చట్ట సవరణ చేసిందని 1971 పాస్ పుస్తకాల చట్టంలోని సెక్షన్ 26ను ఎత్తివేసిందని అన్నారు. ఈ చట్ట ప్రకారం సాగుదారుకు, కౌలుదారుకు కూడా పాస్ పుస్తకం ఇవ్వాలని. చట్ట సవరణతో కౌలు రైతులు తమ వాస్తవ సాగు హక్కును కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 9 డిసెంబర్ 2023 న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో కౌలు దారులకు సహాయం చేస్తానని చెప్పిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలులో ఉన్న అధీకృత లైసెన్స్ రైతుల చట్టం 2011ను అమలు చేస్తానని ప్రకటించిందని గత ప్రభుత్వాలు కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు జరుపకపోవడం వల్ల ఆ రైతులు ఎక్కువ మంది రుణగ్రస్తులై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. వారి కుటుండబాలు చెల్లాచెదురు అవుతున్నాయని కౌలు దారుల హక్కులను ఈ ప్రభుత్వాలు కాపాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం పాలనలో మొట్టమొదటి సారి 1907 లో కౌలుదారులకు హక్కులు కల్పిస్తూ చట్టం చేశారని నాటి జమిందారీ వ్యవస్థలో గ్రామాలకు గ్రామాలు కౌలు చేసుకొని బ్రతుకులీడ్చారని తెలిపారు. వారికి రక్షణ కల్పించడానికి నాటి రైతాంగం పోరాటాల వల్ల నిజాం ప్రభుత్వం చట్టాలు చేసిందని ఆ తర్వాత భారతదేశంలో ఆంగ్లేయ ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో కౌలు చట్టాలను చేసిందని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలలో సగానికి పైగా కౌలు రైతుల వే ఉంటున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రాములు, విష్ణు, వెంకటేష్, చెన్నయ్య, మణి వర్దన్, మొగలి, ఆది తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరులోని ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్ జులై 08 ప్రభాతవార్త : మఖ్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్న వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి ఆత్మకూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రోజు ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. మఖ్తల్ నియోజకవర్గం అభివృద్ధి కోసమే నిరంతరం శ్రమిస్తూ రోజుకు 18 గంటల పాటు విధులు నిర్వహిస్తున్న శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం నిర్వహిస్తూ ఒక వర్గాన్ని కించపరుస్తున్నట్లుగా వాట్సాప్ లలో వైరల్ చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు అవసరమైతే నియోజకవర్గ అభివృద్ధి కోసం సూచనలు సలహాలు చేస్తే తాము తప్పకుండా స్వీకరిస్తామని అంతేగాని లేనిపోని తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తే న్యాయపోరాటం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. శాసనసభ్యులుగా ఎన్నికైనా నాటి నుండి నియోజకవర్గ అభివృద్ధి కోసం నియోజకవర్గంలోని ప్రతి పంటకు సాగునీరు ప్రజల ఆరోగ్య భద్రత కోసం చేస్తున్న ప్రయత్నాలను సమర్ధించాల్సింది పోయి విష ప్రచారం చేయడం పార్టీ నేతలకే చెందిందని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. అనంతరం ఆత్మకూర్ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మండల అధ్యక్షులు రహమతుల్లా ,మఖ్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ ,కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, మనివర్దన్ రెడ్డి, నల్లగొండ శ్రీనివాసులు, చికెన్ వెంకటన్న ,శ్రీనివాసులు తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

మఖ్తల్ ఎమ్మెల్యే పై అసత్య ప్రచారాలు మానుకోవాలి



అమరచింత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత జులై 08 ప్రభాతవార్త : మఖ్తల్ శాసనసభ్యులు శ్రీహరి పై అసత్య ప్రచారాలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో రెడ్ల రాజ్యం పరిపాలిస్తుందని మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నట్లు వాట్సాప్ గ్రూపులో కావాలని కొందరు వ్యక్తులు కుట్ర పన్ని అసత్య ప్రచారం చేస్తున్నారని అలాంటి వారికి మఖ్తల్ ప్రజలు బుద్ధి చెప్తారని వారన్నారు. కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్లుగా ప్రజలకు సేవ చెస్తూ అనేక పదవులు అనుభవిస్తూ ఏనాడు మచ్చలేని నాయకుడిగా ఎదుగుతుంటే ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు మఖ్తల్ ఎమ్మెల్యే, వాకిటి శ్రీహరి పై బురద చల్లడం అన్యాయమని వారన్నారు. మఖ్తల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం 40 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని నియోజకవర్గంలో అభివృద్ధి చూసి ఓర్వలేక ఎమ్మెల్యే శ్రీహరి పై లేనిపోని ఆరోపణలు చేస్తే మఖ్తల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్‌నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని వారు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మండల యువజన సంఘం అధ్యక్షులు శ్యామ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు పోసిరి విష్ణు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రకాశం, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ తౌఫిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు పదవీ విరమణ ఉండదు..

ఎంపిటిసి, జడ్పీటిసిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే ఆల



పదవి విరమణ పొందిన ప్రజా ప్రతినిధులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే

అడ్డాకుల,జులై08 ప్రభాతవార్త: నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులు సన్మాన కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే నివాసం అన్నసాగర్ గ్రామంలో సోమవారం అడ్డాకుల మండల జడ్పీటిసి నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి మండల కో ఆప్షన్ ఖాజాగోరి, ఎంపిటిసిలు రంగన్నగౌడ్, చంద్రయ్య, మణెమ్మ, అనిత, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ చక్రపాణిరెడ్డి, ఏలుసరి శ్రీనివాసులు వీరి పదవి కాలం పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి షీల్డులు బహూకరించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలం అధికారంలో ఉండి దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని 10 సంవత్సరాలలో నియోజకవర్గానికి గుర్తుండే విధంగా పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. మీరు పదవిలో ఉన్నన్ని రోజులు మీమీ గ్రామాలలో అభివృద్ధి పనులు చేసుకున్నారని చిరకాలం గుర్తుండిపోయే పనులు చాలా చేశామని ప్రజాసేవకు పదవి విరమణ ఉండదని భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అనుభవించి ప్రజలకు సేవ చేయాలన్నారు.కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు టి. శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జితెందర్‌రెడ్డి, జడ్పీ మాజీ కో ఆప్షన్ మహిమూద్, వివిధ గ్రామాల మాజీ స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైయస్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జియంఆర్

దేవరకద్ర,జులై 08 ప్రభాతవార్త: దేవరకద్రలో సోమవారం దివంగత ముఖ్యమం త్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మదుసూధన్‌రెడ్డి(జియంఆర్)పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండు వద్ద నున్న వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీపీసీసీఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కు మార్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి,కౌకుంట్ల మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి,నాయకులు గోవర్దన్‌రెడ్డి, నరసింహ్మరెడ్డి,కోన రాజశేఖర్,రఘువీరవర్మ,కొండ శ్రీనివాస్‌రెడ్డి. నర్వశ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం

ఉప్పునుంతల,జులై 08 ప్రభాతవార్త : శ్రీశైలం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటి డైరెక్టర్‌గా నియామక మవుతున్న సందర్భంగా లక్ష్మాపూర్ గ్రామంలో సురెందర్‌రావు శ్రీ ఉమామహ్వేర మాజీ డైరెక్టర్ శ్రీనివాసచారి ఆధ్వర్యంలో సోమవారం శిరసనగండ్ల సురెందర్‌రావును శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.సన్మానించిన వారిలో మాజీడైరెక్టర్ శ్రీనివాసచారి, కాల్వగోవర్ధన్‌రెడ్డి,పరశురాంరెడ్డి, కృష్ణయ్య, ఖాజా పాల్గొన్నారు.

ఎల్ఓసి లెటర్‌ను అందజేసిన ఎమ్మెల్యే

గద్వాల ప్రతినిధి జులై 8 ప్రభాతవార్త: గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు కెటి దొడ్డి

లష్కర్ ఉద్యోగులకు జీతాలు విడుదలకు కృషి

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

లష్కర్ ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రులు

కొల్లాపూర్,జులై 08 ప్రభాతవార్త: గత ప్రభుత్వంలోని తప్పిదాలే శ్రీశైలం నిర్వాసిత లష్కర్ ఉద్యోగులకు శాపంగా మారిందని అందుకే గత 13 నెలలు గా వారికి జీతాలు చెల్లింపులలో నిర్లక్ష్యం చోటు చేసుకుందని తొందరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర నీటి పాదరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జిఓ 98 ద్వారా కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న లష్కర్లకు గత 13 నెల లుగా జీతభత్యాలు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొన్నారని వారి సమస్య పరిష్కారానికి వీలైనంత త్వరగా కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు అన్నారు. కాంగ్రెస్ పార్టీనాయకులు కళ్యాణ్‌రావు ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులను కలసి లష్కర్ ఉద్యోగులు తమ గోడును విన్నవించుకున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పని చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన లష్కర్ ఉద్యోగులు కర్నూలు, కడప, మైదుకూరు తదితర ప్రాంతాలలో పని చేస్తున్న 53 మంది తెలంగాణ లష్కర్ ఉద్యోగులను తెలంగాణలోకి తీసుకొచ్చామని, మాజీ మంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలకు క్షీరాభిషేకాలు, సన్మానాలు, సోషల్ మీడియాలో పబ్లిసిటి చేసుకుని లష్కర్లకు 13 నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా వారిని రోడ్డున పడేశారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న నీటిపారుదల శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జాని మంత్రులు ఎందుకు జీతాలు ఆలస్యం అయిందని తెలుసుకుని వెంటనే జీతాలు విడుదల చేయాలని ఆదేశించారు. దీంతో లష్కర్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, మండల సీనియర్ నాయకులు మందడి చిదంబరంరెడ్డి, భోగం రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు జగదీష్, గంగారి శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి పాలమూరు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రధానంగా తాము పని చేస్తున్నట్లు చెప్పారు. నా భూములు, నా బినామి, నా ఆస్తులు, నా పరిది అనేది గత పాలకుల మాదిరిగా మాకు హద్దులు, సరిహద్దులు లేవని పాలమూరు మొత్తం అభివృద్ధి చెందడమే అని, విడగొట్టడం, విడదీయడం మా నైజం కాదని,మనుషులను కలపడం మనసులు కల్పే ప్రయత్నం చేస్తామని అందుకే పార్టీలకతీతంగా మహబూబ్‌నగర్ జిల్లా ఉమ్మడి సమస్యలను సమిష్టిగా అందరం కలిసి కట్టుగా పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి సూచనలు, సలహాలు తీసుకుంటామని, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ కూడా పాలమూరు అభివృద్ధిలో భాగం కావాలనే మేము కోరుతున్నామని, మహబూబ్‌నగర్ జిల్లాకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తెచ్చేందుకు కృషి చేయాలని ఎంపిని కోరారు.ంతకు ముందు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్య క్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఇరిగేషన్,విద్య, వైద్యంపై ఉమ్మడి జిల్లాకుసంబంధించినఅంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష చేస్తారని, పాలమూరురంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి లాంటి పెండింగ్ ప్రాజెక్టుల గురించి పూర్తి స్థాయిలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లాకుచెందిన అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ఒబేదుల్లా కొత్వాల్,టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, ఐఎన్‌టియుసి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, ఫయాజ్ పాల్గొన్నారు.

99 ఏండ్లు లీజుకి ఇచ్చినట్లు నిరూపించాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రతిష్ట పెంచే విధంగా పని చేయాలి అవేమీ పట్టించుకోకుండా కేవలం రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. మహబూబ్‌నగర్ ప్రజలారా కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారం అ సలు నమ్మవద్దని, పదేండ్లు కష్టపడి మహబూబ్‌నగర్‌ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తే నా మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎవరైనా ఇంత అభివృద్ధి చేసారా? ఆలోచన చేయాలని,ఎన్నికలుఅయిపోయాయి.రాజకీయాలు తప్పుడు ప్రచారంపక్కకు పెట్టి అభివృద్ధిపై కాంగ్రెస్‌ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరారు.నాయ కులు మారినంత మాత్రాన బిఆర్ఎస్ పార్టికి ఏం కాదు. క్షేత్రస్థాయిలో క్యాడర్ గట్టిగా ఉంది.పార్టీఅధికారంలోకి వస్తుందనిఆశాభావంవ్యక్తంచేశారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ నర్సింహులు,ముడా మాజీ ఛైర్మన్ గంజి వెంకన్న, డిసిసిబి వైస్ ఛైర్మన్ వెంకటయ్య,పట్టణఅధ్యక్షులు శివరాజ్, కౌన్సిలర్లు గణేష్,రామ్, అనంతరెడ్డి, సీనియర్‌నాయకులు శ్రీనివాస్‌రెడ్డి,నవకాంత్,సుధాకర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా భూత్పూర్, సంగంబండ, నేరడుగాం వంటి ప్రాంతాలు అభివృద్ధి కొరకు ఏమి ఉన్నా నా వంతుగా పార్టీలు పక్కనబెట్టి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో రోడ్ల బాగుకోసం కూడా కలిసి కృషి చేస్తానని, సాగునీరు, త్రాగునీరు అందించే విషయంలో కూడా ఇక్కడ ఉన్న ప్రాంత ఎమ్మెల్యే తనతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రబిజెపి కార్యవర్గసభ్యులు బి.కొండయ్య, బంగ్లా లక్ష్మి కాంత్‌రెడ్డి, పావని మల్లికార్జున్, అఖిల రాజశేఖర్‌రెడ్డి, గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, కర్నెస్వామి, సోమశేఖర్‌గౌడ్, బిజెపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బంది భిక్షాటన

మొదటి పేజీ తరువాయి భాగం..

26 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మికులులక్ష్మన్న, అమీర్‌ఇబ్బాల్,కృష్ణమూర్తి, ఎల్లయ్య, రామచంద్రయ్య, గోవిందమ్మ, అలివెలమ్మ, శాంతమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

పాలమూరు అభివృద్ధికై

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇదేబాటలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా వస్తే భారీ నిధులతోపాటు పరిహారం అందనున్నది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపొందిన విషయం తెలిసిందే.అయితే కేంద్రరాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగితే ఈ అంశంపై ముందడుగు పడే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

జడ్చర్ల దవాఖానకు వైద్యులు, వసతులపై.. ఉమ్మడిజిల్లాలోని పీహెచ్‌సీల అప్‌గ్రేడ్,ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, సిబ్బంది నియామకంపై సమీక్షించనున్నారు. ఇందులో భాగంగా వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.జడ్చర్లలో గతప్రభుత్వ హయాంలో 100పడకల దవాఖాన అని, కనీస వసతులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేకుండా ప్రారంభించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని, 123మంది సిబ్బందికి గానూ కేవలం సగం మందే ఉన్నారని ఇంకా 73మంది అవసరం ఉందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపైతానే ముఖ్యమంత్రితో కూడాచర్చిస్తాననిఇప్పటికే ఎమ్మెల్యే తెలిపారు. దీంతోపాటు ఉమ్మడి జిల్లాలో పొడవునా కొత్తూరు నుంచి అలంపూర్ వరకు జాతీయ రహదారి ఉన్నందునా ఎమర్జెన్సీ దృష్ట్యా ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సీఎంకు విన్నవించనున్నారు.

నిస్వార్థ సేవలకు కేరాఫ్ లయన్స్ క్లబ్

మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 08 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ సేవలు చిరస్మరణీయమని, నిస్వార్థ సేవలకు లయన్స్ క్లబ్ కేరాఫ్‌గా నిలుస్తుందని పోలీస్ హౌజింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ ప్రజలకు సేవ చేసే భాగ్యం కొందరికి దొరకదని, తాను లయన్స్ క్లబ్‌లో 20ఏళ్లుగా ఉంటూ పలు సేవాకార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో లయన్ నటరాజ్, లయన్ మృత్యుంజయరెడ్డి, లయన్ అశోక్‌యాదవ్, ప్రసాద్, రమణయ్య, తిరుపతిరెడ్డితోపాటు కొత్త సభ్యులుబాబుల్‌రెడ్డి,అశ్విని చంద్రశేఖర్, అశోక్ కుమార్,రాజుచారి,రామనేశ్వర్‌రెడ్డి,అనంతచంద్రప్రకాష్,వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

వనపర్తి ప్రతినిధి జులై 08 ప్రభాతవార్త: వనపర్తి పట్టణం రాజీవ్ చౌక్ దగ్గర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించడం జరిగింది. చిన్నారెడ్డి మాటాడుతూ మన ప్రియతమ నాయకులు డా.వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించడం చాలాసంతోషకరం.అప్పటి మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి వెనుకబడిన జిల్లా అయినా మహ బూబ్ నగర్ జిల్లాకు 7000 కోట్లు అందించి నీటి ప్రాజెక్టులకు పూర్తి కావడానికి ఎంతో దోహదం చేయడం జరిగింది. చిన్నారెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, బిసి సెల్ అధ్యక్షులు కోట్లరవి, ఫిషరీస్ ఛైర్మన్ నందిమల్లయాదయ్య, మాజీ పట్టణ అధ్యక్షులు కిరణ్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బి కృష్ణ, కమ్మర్ మియా ,అక్తర్, కోళ్ల వెంకటేష్, రాగి వేణు,చీర్ల జనార్ధన్, మండల అధ్యక్షులు నారాయణ,పెంటన్నయాదవ్,ఎద్దుల విజయ్‌వర్ధన్‌రెడ్డి, దివాకర్ యాదవ్, రోహిత్, వేనచారి, కౌన్సిలర్ పద్మపరుశురాం, మెంటపల్లి రాములు, అబ్దుల్లా, బాబా,దాసరాజుల భాస్కర్, ప్రవీణ్‌రెడ్డి,సంజీవ్ సాగర్, జానకి రాముడు,ఇర్షాద్, ఎల్లయ్య,జానంపేటనాగరాజు,వెంకటేశ్వర్‌రెడ్డి, మసీ కొండ, నందిమల్ల రాములు,బాలరాజు, గడ్డం వినోద్, రాగి అక్షయ్, నరసింహా, అసిఫ్, కృపాకర్ రెడ్డి, సహదేవుడు, ఈశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మిద్దె శ్రీకాంత్, పెద్దమందడి గట్టురాజు, రాము, రణదీర్ రెడ్డి, రవి ,సందీప్, మహేష్, రాంజీ, విజయ్, శివ ప్రసాద్, వెంకటేష్, రవి, దయాకర్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి, జులై 08, ప్రభాతవార్త: దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించి వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగానిర్వహించారు.కార్యక్రమంలోనాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి,ఏజాస్,సురేందర్‌రెడ్డి, హరికృష్ణ, నాని, సంతోష్, జమ్ముల శ్రీకాంత్, ఖదీర్, దున్న సురేష్, తదితరులు ఉన్నారు.

వెల్దండ, జూలై 08 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరుపేదల గుడిసెల్లో వెలుగులు నింపిన సూర్యుడని పలువురు నాయకులు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్ర శ్రీను ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణ ముదిరాజ్,ఎండీ.హమీద్,రషీద్, పంతులనాయక్, రమేష్, తిరుపతిరెడ్డి, పోలే రాజు, జగన్, నవీన్‌రెడ్డి, భరత్‌గౌడ్, శ్రీను తదితరులు ఉన్నారు.

మక్తల్ టౌన్,జులై 08 ప్రభాతవార్త: నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కార్యక్రమంలో మక్తల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్,కుమారస్వామి,రవికుమార్,మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు,మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాజాపూర్,జులై 08 ప్రభాతవార్త: సోమవారం దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజాపూర్ ముఖ్య కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య, పోలేపల్లి యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి,శివకుమార్, నసీర్‌బేగ్, శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూర్ జులై 08 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను ఆత్మకూరు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.పట్టణంలోని గాంధీ చౌరస్తాలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్లగొండ శ్రీనివాసులు తులసిరాజు యాదవ్, మహేశ్వర్‌రెడ్డి, మనివర్ధన్‌రెడ్డి, వెంకటన్న, శ్రీనివాసులు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి జులై 08 ప్రభాతవార్త: పెద్దమందడి మండల కేంద్రంలో జననేత, అపర్గ భగీరథుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి. పెంటన్న యాదవ్, ఉపాధ్యక్షులు వాకిటి శ్రీనివాసులు, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ. సత్య రెడ్డి, ప్రస్తుత సింగల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గట్టు మన్యం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ వహీద్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సింగల్ విండో డైరెక్టర్ వాకిటి నరేష్ కుమార్, పల్లె సత్యనారాయణ, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, కొండరవీందర్ రెడ్డి, మణిగిల్ల సురేష్, అల్వాల లక్ష్మి కాంత్ రెడ్డి, విక్రమ్ రెడ్డి,లక్ష్మీనారాయణ,రఘువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకోట జులై 08 ప్రభాతవార్త: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు కొత్తకోట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పోలీస్ స్టేషన్ సమిపంలో ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్, మాజీ జడ్పిటిసి బాబు, జిల్లా కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు బిమపల్లి, పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీను, ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మిషేక్, సుభాస్, నవీన్, ప్రశాంత్, శ్రీకాంత్,మండల నాయకులు,బీసీ, ఎస్సీ,ఓసీ, ఎస్టీ, మైనార్టీ, సేవాదళ్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి,జులై 08 ప్రభాతవార్త: ప్రజల కలల స్వప్నంలో పథకాల రూపంలో ఎప్పటికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని పలువురు కాంగ్రెస్ నాయకులు వైఎస్ జయంతి వేడుకల్లో స్మరించుకున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి పూలమల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మలిశెట్టి వెంకట్‌స్వామి, దేవరకొండ రాంచందర్, అమృత్‌రెడ్డి, రామకృష్ణ, బంగారి పర్వతాలు, కత్తె ఈశ్వర్, నజీర్, జయకృష్ణ, ఖలీల్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, బన్నయ్య, గోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హనుమంతురెడ్డి, రాము బంగారయ్య, మహేష్, భూపాల్ పాల్గొన్నారు.

భూత్పూర్,జూలై8,ప్రభాతవార్త: మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి (వైఎస్సార్) 75వ జయంతి వేడుకల్ని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు,కార్యకర్తలు సోమవారం భూత్పూర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు.వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి (జీఎంఆర్) పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లా డుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో లేనప్పుడు మాజీ సీఎంవైఎస్సార్ కాంగ్రెస్ తరఫున ప్రాతినధ్యం వహించి రాష్ట్రంలో పాదయాత్ర నిర్వహించి కాంగ్రెస్‌ను ఒంటి చేత్తో నిలబెట్టిన మహానేత అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,మాజీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డితో పాటు నాయకులు గోవర్ధన్‌గౌడ్,బోరింగ్ నర్సింహులు, గడ్డం ఎల్లప్ప,బజార్ పరుశురాం,తిరుపతిరెడ్డి, మండి అంజి,మాతరి రాము తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్,జులై08 ప్రభాతవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రి అని బాలానగర్‌మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మామిడిగుట్ట శంకర్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి ఆలయ పరిరక్షణ, అభివృద్ధి బాధ్యత నాది

- గుండం పూడ్చివేత ఘటనపై కేసు నమోదు చేయించింది నేనే
- అందరూ స్వలాభం కోసమే వాట్సాప్‌లో తప్పుడు పోస్టులు
- దేవుడు పేరుతో రాజకీయం చేస్తే సహించను..
- త్వరలోనే ఆలయ అభివృద్ధికి ఒక కమిటీ వేసుకుందాం..
- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

గుట్టపై గుండాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 08 ప్రభాతవార్త: జడ్చర్ల మున్సిపాలిటీ బాదేపల్లి పాత బజార్‌లో గల పెద్ద గుట్టపై ఉన్న శ్రీరంగనాయకస్వామి ఆలయం దగ్గర కోనేరు మూసివేసిన సంఘటన గూర్చి సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి అక్కడ జరిగిన సంఘటన పరిస్థితులను ఆరా తీశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరంగనాయకస్వామి ఆలయం దగ్గర శుక్ర వారం జరిగిన కోనేరు పూడ్చివేత విషయం తెలిసిన వెంటనే స్థానిక సిఐతో మాట్లాడి శనివారం ఉదయం దానికి కారకులైన వ్యక్తిపై కేసు నమోదు చేయించడం జరిగిందన్నారు. ఈ సంఘటనపై స్థానికంగా ఉన్న ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేయకపోవడం బాధాకరమని అన్నారు.చివరికి ఎవరు ఫిర్యాదు చేయకపోతే నేనే స్వయంగా అనిల్ అనే వ్యక్తితో ఈ సంఘటనపై ఫిర్యాదు చేయించడం జరిగిందన్నారు. తక్షణమే సిఐ సంఘటన స్థలానికి వెళ్లి కోనేరును యధాస్థితికి తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సంఘటనపై తాను ఎమ్మెల్యేగా అన్ని విధాలుగా అధికారులతో మాట్లాడి దానికి కారకులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కానీ కొందరు వ్యక్తులు రాజకీయ స్వలాభం కోసం వాట్సాప్ గ్రూప్‌లలో ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని తప్పుడు పోస్టులు పెట్టిస్తున్నారు. ఈ సంఘటనను రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. దేవుని సంఘటనపై రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. సంఘటన గురించి జరుగుతున్న పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ఈ విషయాలు తెలుసుకోకుండా హిందూ ధార్మిక సంఘాలు బంద్‌కు పిలుపునివ్వడం సరైంది కాదన్నారు. ఆ సంఘటన వల్ల అన్ని విధాలుగా విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తాను హిందువునే అని హిందూ మతంపైగాని

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తులం బంగారం లబ్ధిదారులకు అందిస్తాం: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాపూర్, జులై 08 ప్రభాతవార్త: రాజాపూర్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పంపిణీ చేశారు. సోమవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేతుల మీదుగా 40 చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగాఎన్నికైన ఆరు నెలల్లోనే జడ్చర్ల నియోజకవర్గంలో భూదందాలు, భూ కబ్జాలు లేకుండా అవినీతి రహిత జడ్చర్లగా తయారు చేశానని అన్నారు. నిన్ననే జడ్చర్ల నియోజకవర్గానికి 6 సబ్ స్టేషన్‌లను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కళ్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ గురించి ప్రభుత్వం చర్చిస్తుందని, త్వరలోనే తులం బంగారం లబ్దిదారులకు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నా సొంత మండలం రాజాపూర్‌ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

మక్తల్, జులై 08 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అందించిన సేవలు మరువలేనివని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుకు సాగాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా సోమవారం మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిపిగడ్డంపల్లి హనుమంతు, మండల అధ్యక్షులు గణేష్‌కుమార్, ఆనంద్‌గౌడ్, నాయకులు కోళ్ల వెంకటేష్, కట్ట సురేష్, రవికుమార్, శాలం పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి సన్మానం

బిజినేపల్లి, జులై08 ప్రభాతవార్త: లట్టుపల్లి పరిధిలోని కర్నెతాండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను సోమవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పరిశీలించారు. బిజనపల్లి మండల శివారు ప్రాంతంలోని గిరిజన తండాల రైతులు చిన్నారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి గిరిజన రైతాంగానికి సాగునీరందేలా చూడాలని కోరారు. ఈ వానా కాలం సీజన్‌లో కృష్ణానది ప్రవాహం ప్రారంభమైందని పెండింగ్ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో కృష్ణాజలాలు పారి రైతాంగానికి న్యాయం జరుగుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కల చెరువు, ఉడుకులకుంట తండాలకు వెళ్ళేందుకు త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీఇచ్చారు. ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మాజీ ఎంపిపి కృష్ణానాయక్‌లను గిరిజనులు సన్మానించారు. కార్యక్రమంలో ఎం.గోవింద్‌నాయక్, కలియ నాయక్, బాలు, ఆర్.రాజునాయక్, ఎం.హన్మంతు, ఎం.దీపక్‌నాయక్, ఆర్.పిట్య, వి.హన్మంతునాయక్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

లింగాల, జులై 08 ప్రభాతవార్త: రైతులు మొక్కజొన్న పంటలలో తగు జాగ్రత్త లు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సూరపూర్ గ్రామ శివారులోని మొక్కజొన్న పంట లను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి మాట్లా డుతూ మండలంలోని మొత్తం రైతులు వర్షాకాలంలో మొక్కజొన్న పంటలు 6200 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. వర్షాలకనుగుణంగా జులై15 వరకు మొక్కజొన్న విత్తనాలు వేసుకోవచ్చన్నారు. మొక్కజొన్న పంటలకు కత్తెర పురుగు ఆశించి నష్టపరుస్తాయని తెలిపారు. కత్తెర పురుగు ఆశించకుండా నివారించడానికి బెంజోట్ అనే క్రిమిసంహారక మందును ఎకరాకు 100 గ్రాములు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్‌సెట్ ధృవపత్రాల పరిశీలన

బిజినేపల్లి, జులై 08 ప్రభాతవార్త: పాలెం శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గత మూడు రోజులుగా ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ముగిసింది. ఎఫ్‌సెట్ (ఎంసెట్) జిల్లా కో ఆర్డినేటర్ పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.విద్యారాణి వివరించారు. జిల్లా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్న 877 మంది విద్యార్థులకు గాను 864 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 6వ తేదీన 305మంది విద్యార్థులకుగాను 303 మంది విద్యార్థులు, 7వ తేదీన 302మంది విద్యార్థులకు గాను 293 మంది విద్యార్థులు, 8వ తేదీన 270 మందికిగాను 268 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గత మూడు రోజులుగా ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన పూర్తయినట్లు వివరించారు.

నేరస్తునికి 15 రోజులు డిమాండ్

లింగాల, జులై 08 ప్రభాతవార్త: ఆదివారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో పర్వతాలు, రామచందర్‌కు ప్లాటు, నీటి సంపుల విషయంలో జరిగిన గొడవలో రామచందర్‌కు ముఖంపై తీవ్రంగా దెబ్బలు తగిలాయి. రామచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సోమవారం నేరస్తుని అచ్చంపేట కోర్టులో జడ్జి ముందు హాజరు పరచగా నేరస్తుడు పర్వతాలుకు 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఇటిక్యాల జులై 8 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొండేరు గ్రామానికి చెందిన తెలుగు రాముడు మృతి చెందారు. అలాగే యాక్తాపురం గ్రామానికి చెందిన రాముడు మృతి చెందగా సోమవారం విషయం తెలుసుకున్న శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ పోతురాజు సోమనాద్రి వారి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంతేకాక బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు 2 కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొపున10 వేల రూపాయల ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు అందజేశారు వీరి వెంట బీచుపల్లి లింగరాజు, బలరాముడు, నాగన్న, బుచ్చన్న, కృష్ణయ్య, లక్ష్మన్న, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివి

● బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి ● ఎంపిటీసీ, ఎంపిపి, జెడ్పీటీసీల సన్మాన సభలో మాజీ ఎమ్మెల్యే ఆల..



పదవీకాలం ముగిసిన ఎంపిటీసీ,జెడ్పీటీసీ,ఎంపిపి ఇతర సభ్యుల్ని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్, జులై 8, ప్రభాతవార్త: లక్షలాధి మంది కార్యకర్తల్ని కూడ గట్టుకుని ప్రజాభిమానాన్ని చూరగొన్న పార్టీగా బీఆర్ఎస్ నిలుస్తుందని, పార్టీని పటిష్టపర్చడంలో స్థానిక ప్రజాప్రతినిధుల సేవలు మరువలేనివని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పదవీ కాలం ముగిసిన ఎంపిటీసీ, జెడ్పీ టీసీ, ఎంపిపి, కోఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సభ్యులకు మాజీ ఎమ్మెల్యే ఆలసోమవారం తన స్వగ్రామం, క్యాంప్ కార్యాల యమైన భూత్పూర్ మండలం అన్నాసాగర్ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పదవీ కాలం ముగిసిన ఎంపిపి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిటీల సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఆల శాలువలు, పూలమా లలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడు తూ తెలంగాణ సాధకుడు, పదేళ్లపాటు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన దీక్షా దక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించిందన్నారు. బీఆర్ఎస్ లక్షలాది మంది కార్యకర్తల్ని కూడగట్టుకుందని, బీఆర్ఎస్‌కు ఎంపిటీసీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ సభ్యులు అధికంగా ఉన్నారని కానీ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ప్రజలు, సామాన్యులు నమ్మి, కాంగ్రెస్ పార్టీకి ఓటువేశారనిఅన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతి నిధులు అధైర్యపడొద్దని, రాబోయే కాలం బీఆర్ఎస్‌దేనని, త్వరలో రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి బీఆర్ ఎస్‌కు పూర్వ వైభవాన్ని సాధించి పెట్టాలని సూచించారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ భూత్పూర్ మండల అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు మనెమోని సత్య నారాయణ, రామన్‌గౌడ్, సత్తూర్ నారాయణగౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకలసత్య నారాయణ, ఆకుల వెంకటయ్య, సత్తూర్ అశోక్ గౌడ్, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయన ఆదర్శ మూర్తి మహోన్నత మేధావి

● ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు జ్యోతిబస్ : సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.డి జబ్బార్

జ్యోతిబస్ చిత్రపటానికి పూలమాల సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్

వనపర్తి టౌన్, జులై08 ప్రభాతవార్త: జ్యోతిబస్ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ జ్యోతిబసు 110వ జయంతి ఆయనో ఆదర్శమూర్తి నమ్మిన సిదాంతాలను కడవరకూ ఆచరించి చూపిన మహానేత, శ్రమజీవుల కోసం జీవితాన్ని అంకితం చేసిన యోధుడు, గొప్ప పరిపాలనాదక్షుడు, రాజకీయ చతురుడు, భారతదేశ రాజకీయాలను ప్రభావితం చేసిన అరుదైన నాయకుడు, దేశ రాజకీయాల్లోనే విశిష్ట నేతగా గుర్తింపు పొంది, ప్రజా సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేసిన విప్లవ యోధుడు, 23 ఏళ్ల పాటు నిరాటకంగా ముఖ్యమంత్రిగా ఉండి రికార్డు సృష్టించి, ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు. పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులుజ్యోతిబసు 105వ సయంతి సందర్భంగా ఆయన గురించి, బాల్యం, జ్యోతిబసు జులై 8, 1914న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. తండ్రి నిశికాంత్ బసు వైద్యుడిగా పనిచేసేవాడు. తల్లి హేమలతా బసు, స్థానికంగా కలకత్తా (ఇప్పటి కోల్‌కత్తా) లోనే జ్యోతిబసు విధ్యాభ్యాసం కొనసాగింది. ఇతని అసలు పేరు జ్యోతికిరణ్ బసు కాగా పాఠశాల దశలో ఉన్నప్పుడు తండ్రి జ్యోతిబసుగా పేరును తగ్గించాడు. ప్రెసిడెన్సీ కళాశాల జ్యోతిబసు తన డీగ్రీ పూర్తిచేశాడు. ఉన్నత చదువుల కోసం1935లో ఇంగ్లండ్ బయలుదేరాడు. 1940లో న్యాయ శాస్త్ర విద్య పూర్తిచేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్ గా అర్హత పొందారు. అదే యేట భారతదేశానికి తిరిగివచ్చాడు. అంచెలంచెలుగా ఎదిగిన నేత 1941 లో బసు తల్లి మరణించిన నాటి నుండి పార్టీ కార్యకర్తగా యావత్ కాలాన్నీ వినియోగించడం ప్రారంభించారు. అక్కడి నుండి బెంగాల్ రాజకీయ యవనికపై అంచెలంచెలుగా ఎదిగారు. 1941-43 మధ్య బెంగాల్, అస్సాం రైల్వే వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా బాద్యతలు స్వీకరించారు. 1944 నుంచి ట్రేడ్ యూనియన్ బాద్యతలు చేపట్టారు. 1946-47 లో బెంగాల్లో సాగిన 1948లో బెంగాల్‌లో కమ్యూనిష్టు పార్టీపై నిషేధం విధించారు. ఆ సందర్భంగాబసు అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. 1950లో అవిభక్త కమ్యూనిష్టు పార్టీ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1953 నుంచి 1961 వరకూ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగాబాధ్యతలు నిర్వహించారు. 1964లో సిపిఐ(ఎం) ఏర్పడిన నాటి నుంచి పొలిట్‌బ్యూరో సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. తుపాకీ గుళ్లకు బెదరని వీర యోధుడు 1970 మార్చి 31 బీహార్, రాజదాని, పాట్నా రైల్వే స్టేషనల్‌లో జ్యోతిబసు రైలు దిగుతున్నప్పుడు ఓ దుండగుడు బస్సు పై కాల్పులు జరిపాడు. అయితే ఆ సమయంలో సిపిఎం అభిమాని అలీ ఇమాం జ్యోతిబసుతో కరచాలనం చేసేందుకు ముందుకువచ్చారు. ఇమాం ఇంటికి వెళ్లి కుటుంబీకులను ఓదార్చి వారికి తగిన సాయం కోసం ఏర్పాట్లు చేశారు. 1971లో కాంగ్రెస్ దుండగులు జ్యోతిబసుపై రెండు సార్లు దాడికి యత్నించారు. పేదల ప్రభుత్వంగా గుర్తించి 1977లో బసు తొలిసారిగా ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుండే బడుగు బలహీన వర్గాల కోసం ఆయన ఎంతో కృషి చేశారని బెంగాల్‌వాసులు నేటికి గుర్తుచెసుకుంటారు. జ్యోతిబసుకు కుమారుడు చందన్, కోడలు, ముగ్గురు మనుమలు ఉన్నారు. జ్యోతిబసు మరణానికి ముందే ఆయనభార్య కమలనాలుగేళ్ల క్రితం మరణించారు. దేశ చరిత్రలో, ప్రజల మనస్సులో చిరకాలం నిలిచిపోయారు. ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ నెంబర్ ఏ లక్ష్మి, సాయి, లీల, ఉమా, సుగుణమ్మ, బాలస్వామి, నడిపి కురుమయ్య, చిన్న కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర నియోజకవర్గంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట జులై 08 ప్రభాతవార్త: దేవరకద్ర నియోజకవర్గంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పెర్కొన్నారు. సోమవారం కొత్తకోట మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీముభారక్ కలిపి మొత్తం 90 చెక్కులను దెవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకద్ర పట్టణంలోని డిగ్రీ కళాశాల తీసుకొచ్చమని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో డిగ్రీ కళాశాల మంజురై అడ్మిషన్లు నడుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే దేవకద్రలో 100 పడకల, కొత్తకోటాలో 50 పడకల హాస్పిటల్ కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. భీమా ప్రాజెక్టులోని కోయిల్ సాగర్, శంకర సముద్రం పెండింగ్ సమస్యలు ముఖ్యమంత్రి త్వరలో పరిష్కరిస్తారని తెలిపారు. అలాగే సరళసాగర్ పర్యాటక కేంద్ర చేయాలనీ ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. జాతీయ రహదారి పై 40 కిలోమిటర్లకు ఒక డామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటే వారికి చికిత్స అందించేందుకు ఈ సెంటర్లు ఎంతోగానో ఉపయోగపడుగపడతాయని వాటి కొరకు కూడా మంత్రులతో చర్చించి అనుమతులు తీసుకొస్తానని చెప్పారు. విటన్నిటిపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం మహబూబ్‌నగర్‌కు తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రివ్యూ మీటింగ్ ఏర్పాటుఅయిపోయిన తర్వాతముఖ్యకార్యకర్తల సమావేశం ఉంటుందని ముఖ్య నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుకెసిని విశ్వేశ్వర్, వైస్ చైర్మన్ జయమ్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచుపల్లి, మాజీ జడ్పిటిసి బాబు, నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, బోయేజ్, కృష్ణారెడ్డి, మేస్త్రి శ్రీను, నరేందర్ రెడ్డి, మిషేక్, సుభాష్, వెంకటేష్, శ్రీకాంత్ , గోకరయ్య, పాల్గొన్నారు.

బాలురతో సమానంగా రాణించాలి

అందరు గర్వపడేలా ఆడపిల్లలు ఎదగాలి

నారాయణపేట జిల్లాలో ఎంపి డికె అరుణమ్మ పర్యటన

పస్పులలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ప్రారంభించిన ఎంపి డికె అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కస్తూర్బా గాంధీ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపి డికె అరుణ, ఎమ్మెల్యే పర్ణికరెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, జులై08 ప్రభాతవార్త: బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలన్న ఉద్దేశంతో కస్తూర్బా గాంధీ పాఠశాలలు నెలకొల్పబడ్డాయని ఎంపి డికె అరుణమ్మ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మరికల్ మండలం పస్పుల గ్రామంలో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి డికె అరుణ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఆడపిల్లకు చదువు చాలాఅవసరమని, ఆడపిల్లలు చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ కస్తూర్బాంధీ పాఠశాలలు నెలకొల్పబడ్డాయని అన్నారు. అందరూ గర్వపడేలా ఆడపిల్లలు చదువుల్లో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బాలిక విద్యాభివృద్ధి ఏ అవసరం వచ్చిన నేనున్నానంటూ భరోసానిచ్చారు. త్వరలో కెజిబివిలలో హయ్యర్ స్టడీస్ కూడా రాబోతున్నాయని తెలిపారు. ఆడపిల్లకు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని కష్టపడి చదవాలని సూచించారు. తల్లిదండ్రులు కలలు నెరవేర్చి అందరికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. **ఒకే వేదికపై అత్తా కోడలు...** కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రారంభోత్సవంలో అధికారిక హోదాల్లో ఒకే వేదికపై అత్తా కోడళ్ళు కలవడంతో అందరూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. గత ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేసిన సందర్భంగా విమర్శలు చేసుకున్నప్పటికి ఒక ఎమ్మెల్యేగా మరొకరు ఎంపిక గెలిచిన విషయం తెలిసిందే. ఇదే మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మరికల్ మండలం పసుపుల గ్రామంలో కస్తూర్బా గాంధి ప్రారంభానికి అధికారికంగా అత్తా కోడళ్ళు డికె అరుణ పర్ణికరెడ్డి హాజరు కావడం ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని మాట్లాడుకోవడం విశేషం.

అల్లంపూర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ఇటిక్యాల జులై8 ప్రభాతవార్త: అల్లంపూర్ నియోజకవర్గంలో సాగునీటికి, రోడ్లు, నిర్మాణాలకు నెట్టెంపాడు ప్యాకేజీ కింద పనులు పూర్తి కోసం గత ఏడాది కృష్ణా నదిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందించి నిధులు మంజూరు చేయాలని సోమవారం బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి హైదరాబాదులో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రంలో అల్లంపూర్ నియోజకవర్గంలోని తుమ్మెల్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మ కుంట. జులకల్, వల్లూరు రిజర్వాయర్లను పూర్తి చేసి చివరి ఆకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేయాలని నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు 100, ప్యాకేజ్ కింద పెండింగ్ లోని పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని అలాగే రాయచూరు నుండి ఐజ, శాంతినగర్, అలంపూరు, నందికొట్కూరు , శ్రీశైలం అంతరాష్ట్ర జాతీయ రహదారి నాలుగు లైన్ల రోడ్లు కు నిధులు మంజూరు చేసి ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం కల్పించాలని అలాగే గత ఏడాది ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాలకు చెందిన నలుగురు పల్లెపాడు గ్రామ శివారులో కృష్ణా నదిలో ఈతకు వెళ్లి నలుగురు పిల్లలు మృతి చెందగా ఆ కుటుంబాలకు 20 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరు చేయాలని అలాగే వివిధ అభివృద్ధి పనులకు అలంపూర్ నియోజకవర్గానికి కేటాయించిరైతులకు సాగునీరు రోడ్లు, విద్య, వైద్యం, వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించా లని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకటరామి రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా గత మూడు రోజులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ బిఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్యే విజయుడు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని వస్తున్న సోషల్‌మీడియా ప్రచారంతోసోమవారం హైదరాబాదులోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమెల్సీ చల్లా వెంకటరామి రెడ్డి కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాని వినతిపత్రం ఇవ్వడంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని అలాగే అలంపూర్ నియోజకవర్గంలో చర్చనీయాంశముగా మారింది.

ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలి

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల ప్రతినిధి జులై8 ప్రభాతవార్త: ప్రజా దివాస్‌లో భాగంగా ప్రజల నుండి జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రజలు శాంతి భద్రతలకు సంబంధించి ఏలాంటి ఫిర్యాదు చేసిన తక్షణమే పోలీసు అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలకు అవసరమైనప్పుడు క్షణాలలో వచ్చే పోలీసుస్పందనపైనే ప్రదానంగాదృష్టి సాధిస్తానని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీగా స్వయంగా ప్రజాదివాస్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదుదారులు హజరై సమస్యలను తెలియజేసి అర్జిలను సమర్పిం చారు. వారిని అప్యాయంగా పలకరించి ఓపిగ్గా సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే ప్రజా ఫిర్యాదుల గురించి పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే ప్రజా ఫిర్యాదులు గురించి జిల్లాపోలీసు కార్యాలయంలో డిఎస్పి, సర్కిల్ అధికారులతో చర్చించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందిం చాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లకు వచ్చిన బాధితుల ఫిర్యాదులపై ఇప్పటి వరకుఎలాంటి చర్యలు తీసుకున్నారో రిపోర్టు సబ్‌మిట్ చెయ్యాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకుంటూ, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులకు ప్రజలకుసంబంధాలు మెరుగుపరుస్తూ శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందని, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతిసోమవారం ప్రజాదివస్‌కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సోమవారం వచ్చిన 18 ఫిర్యాదులలో భూ వివాదాలకు సంబంధించి 7 ఫిర్యాదులు, భర్త ల వేధింపులకు సంబంధించి 2 ఫి